




చెస్ పోటీల్లో అదాని వరల్డ్ స్కూల్ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి: ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో ఆదాని వరల్డ్ స్కూల్ కు చెందిన విద్యార్థి పి మిదిలేష్ చెస్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండవ బహుమతిని కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందని ప్రిన్సిపల్ సిరియాల సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాదులో రెండు రోజులు నిర్వహించిన ఇంటర్నేషనల్ చెస్ పోటీల్లో అదాని వరల్డ్ స్కూల్లో ఆరవ తరగతి చదువుతున్న ఈ విద్యార్థి 1500 పైరేటెడ్ టోర్నమెంట్ పోటీలలో మంచి ప్రతిభ చూపి రెండో బహుమతి సాధించడం జరిగిందని విద్యార్థికి తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ హైదరాబాద్ లో షీల్డ్ తో పాటు తొమ్మిది వేల రూపాయల నగదు బహుమతిని అందించారన్నారు.



సమస్యలు పరిష్కరించాలని ప్రచార భేరి



ఉలవపాడులో

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని ప్రచార జాత బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా పట్టణం లోని సుందరయ్య నగర్, ఉప్పు చెరువు, పలుకూరు ప్రాంతాలలో కరపత్ర ప్రచారం జరిగింది. అనంతరం అంబేద్కర్ బొమ్మ వద్ద సిపిఎం పట్టణ కార్యదర్శి గౌస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలం బిస్తున్నాయని ఈ సందర్భంగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకు ప్రచార జాత కార్యక్రమాలు ఉన్నాయన్నారు. నాలుగోవ తేదీ మండల కేంద్రం వద్ద ధర్నా జరుగుతుందనిఅధిక ధరలు తగ్గించాలని, పెరుగుతున్న కరెంటు చార్జీలను తగ్గించాలని ,నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని జరిగే కార్యక్ర మం లో ప్రజలందరూ భాగస్వా ములు కావాలని పిలుపు నిచ్చారు .ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు మున్వర్ సుల్తానా, ఎస్ పవన్ కుమార్, డిఎం రాయుడు, ఎస్కే మల్లిక ,ఎం పద్మ, ఎస్.కె షాహిదా ,ఎస్కే మహాహుజా పాల్గొన్నారు

ప్రజాశక్తి-ఉలవపాడు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం ఉలవపాడు మండల కేంద్రంలోని వరిగచేను సంఘంలో, సింగరాయక ొండ బస్టాండ్ లో సిపిఎం కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం ఉలవపాడు మండల కార్యదర్శి జీవీబీకుమార్ మాట్లాడుతూ అధిక ధరలు అడ్డగోలుగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. పేద ప్రజలు మధ్యతరగతి ప్రజలు ధరలను భారాన్ని మోయలేని విధంగా ఉన్నాయని అన్నారు. గ్యాస్ సిలిండర్ పెట్రోల్ డీజిల్ ధరలు నిత్యవసర వస్తున్న ధరలు అమాంతంగా తిరుగుతున్నాయని, రోజువారి కూలి పనులకు వెళ్ళి రెక్కలు అరిగేలా కష్టం చేసిన ఇల్లు కడవడం లేదని గిరిజనులు సమరభేరి బందం నాయకులకు తెలిపారని పేర్కొన్నారు. ధరలను అదుపు చేయాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడా వ్యాపారులకు కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నాయని తెలిపారు. సమస్యల పైన సెప్టెంబర్ 4న తహశీల్దార్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించినున్నట్లు కుమార్ తెలిపారు. ఈ సమరబేరి కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎస్.డి గౌస్ బాషా,కే. శేషమ్మ,ఎస్. డి. జహీర్, దేవరకొండ. కోటేశ్వరరావు, ఎస్.కె సుల్తాన్ ,కొమరగిరి వెంకాయమ్మ, పొట్లూరి కోటేశ్వరరావు, కే రామ్మూర్తి,కె. సతీష్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో

ఈశ్వరీభూషణంకు సన్మానం

ప్రజాశక్తి-కందుకూరు

ప్రకాశం జిల్లా విద్యాశాఖ జి.ఈశ్వరీభూషణం ను తెలుగు భాషా దినోత్సవ ఆత్మీయ పురస్కారం తో సన్మానించింది.వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కార్యక్రమం లో భాగంగా ప్రకాశం జిల్లా విద్యాశాఖ ఒంగోలు బండ్లమిట్ట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఒంగోలు మేయర్ గంగాడి సుజాత , ఆర్ జే డి జిల్లా విద్యాశాఖాధికారి సుబ్బారావు , ఈశ్వరీభూషణం ను గిడుగు రామమూర్తి పంతులు తెలుగు భాషా దినోత్సవ ఆత్మీయ పురస్కారంతో సన్మానించారు. ఈశ్వరీభూషణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పి సి పిల్లి లో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా భాద్యతలు నిర్వహిస్తూ శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ అధ్యక్షురాలుగా తెలుగు భాషాభివద్ధికి విశేషమైన కషి చేస్తున్నారు. వీరి సేవలను గుర్తించి ప్రభుత్వం విద్యాశాఖ తెలుగు భాషాభివద్ధికి మరింత పునరంకితం కావాలని ఆకాంక్షిస్తూ తెలుగు భాషా దినోత్సవ ఆత్మీయ పురస్కారం అందించింది. కార్యక్రమం లో మార్కాపురం డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్, ఒంగోలు డిప్యూటీ డీఈవో రోజ్ అనిత టంగుటూరు ఎంఇఓ తన్నీరు బాలాజీ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు కవులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పురస్కారం అందుకోవడంతో ఈశ్వరీభూషణం ను ఉపాధ్యాయులు, కవులు రచయితలు స్నేహితులు అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు.



జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి-నెల్లూరు

రానున్న రోజుల్లో జిల్లా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు జిల్లాను అభివద్ధి పధంలో ముందంజలో నిలిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జెడ్పి సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కాకాణి గోవర్ధన్ రెడ్డి, కలెక్టర్ ఎం. హరి నారాయణన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ, పరిశ్రమల శాఖ, మత్స్య శాఖ, ఎస్.సి కార్పొరేషన్, సమీకత గిరిజానాభివద్ధి సంస్థ, జిల్లా వెనుకబడిన తరగతులు, జిల్లా మైనారిటీ కార్పొరేషన్, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా అటవీ శాఖ తదితర శాఖలకు సంబంధించిన అజెండా అంశాలపై చర్చించారు. పలువురు .జెడ్పిటిసి, ఎంపీపీ లు పలు సమస్యలను మంత్రి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలోని ప్రతి పేదవానికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను మరింత చేరువ చేయడానికి, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు దష్టి సారించి గ్రామ, మండల, జిల్లా స్థాయిలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సమస్యల పరిష్కార దిశగా ప్రగతి వైపు అడుగులు వేయడం జరుగుచున్నదన్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిషరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రతిపాదించిన అంశాలను ఆమోదిస్తూ, ఆ ప్రతిపాదనలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులందరూ సమర్ధవంతంగా పనిచేస్తున్నందున అనేక రకాల సమస్యలు పరిష్కారం పొందుతున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మరింతగా జిల్లాను అభివద్ధి పధంలో ముందంజలో నిలిపేందుకు జిల్లా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీ కూర్మనాథ్, తిరుపతి జిల్లా రెవెన్యూ అధికారి బి.కోదండరామిరెడ్డి, జిల్లా పరిషత్ సిఇఓ శ్రీ చిరంజీవి, విజయ డైరీ ఛైర్మన్ శ్రీ కొండ్రెడ్డి రంగారెడ్డి, డ్వామా, డి.ఆర్.డి.ఏ పిడి లు వెంకట్రావు, సాంబశివా రెడ్డి, పరిశ్రమల శాఖ జి.ఎం. మత్స్య శాఖ జెడి నాగేశ్వర రావు, డి ఎఫ్.ఓ చంద్రశేఖర్ రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి

వేతనాలు పెంచాలని వినతి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆంధ్ర ప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మండల కార్యదర్శి మారుబోయిన రాజా సారథ్యంలో అంగన్‌వాడీ మండల కార్యదర్శి ఎస్.కె మస్తానమ్మ, అనిత, భాగ్యలక్ష్మి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గోవర్ధన్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలలో భాగంగా తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని కోరారు. అంతేకాకుండా సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు సంక్షేమ పథ కాలు అమలు చేయాలని తెలిపారు. అంగన్‌వాడీ విద్య బలోపేతం చేయాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. పిల్లలకు యూనిఫామ్ ఇవ్వాలని, అమ్మఒడి అమలు చేయాలని కోరారు. ప్రకాశం జిల్లా టంగుటూ రులో రాజకీయ కక్షలతో హత్యకు గురైన హనుమా యమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హనుమాయమ్మ కుటుం బానికి నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అంద జేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మంత్రి కాకాణికి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

సచివాలయాల్లో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు

నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 12/2 చింతారెడ్డి పాలెం, 12/3 వావిలేటి పాడు వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాలలోని ఇన్వెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిష్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. సచివాలయం పరిధిలో నిర్దేశించిన కార్యక్రమాల్లో ఏలాంటి పెండింగులు ఉంచరాదని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.సచివాలయాల పరిధిలోని ప్రజలకు స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందిస్తున్న ఉచిత వైద్యం, మందుల పంపిణీ, రక్త పరీక్షలు తదితర సేవలపై అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు.



మాట్లాడుతున్న కమిషనర్



మాట్లాడుతున్న సిఐ

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-కందుకూరు

ఉన్నతాధికారుల ఆదేశాలు ప్రకారం కందుకూరు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ వారి ఆధ్వర్యంలో మాదకద్రవ్యల నివారణ లో భాగంగా కందుకూరు పట్టణం లోని "కస్తూర్బ గాంధీ బాలికా విద్యాలయం నందు అవగాహనా కార్యక్రమం బుధవారం జరిగింది. స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులతో పాటు కందుకూరు టౌన్ పోలీస్ స్టేషన్ వారు, ప్రభుత్వ వైద్య అధికారి ఎం.డి. షాజుద్దీన్, కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం ప్రిన్సిపల్ వి. స్వాతి , కళాశాల విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర బందం పాల్గొన్నారు.ఈ సందర్భంగా కందుకూరు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అందరు గంజాయి తదితర మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, , సేవించడం, రవాణా చేయడం, చట్ట రీత్యా నేరమని, ముఖ్యంగా యువత అప్రమత్తం గా ఉండి మాదకద్రవ్యల కు దూరం గా ఉంటూ తమ భవిష్యత్ ను కాపాడుకోవాలి అని, తల్లి తండ్రులు తమ పిల్లల ప్రవర్తన ను గమనిస్తూ వారు చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు దూరం గా ఉండేలా జాగ్రత్త పడాలని, అధ్యాపకులు నిరంతరం విద్యార్థుల ను గమనిస్తూ మంచి అలవాట్ల వైపు మార్గ నిర్దేశం చేయాలనీ తెలిపారు. ప్రభుత్వ వైద్య అధికారి ఎండి షాజుదీన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యల వలన ఆరోగ్య పరంగా అనేక దుష్పలితాలు శారీరకంగా, మానసికంగా తీవ్రంగా కలుగుతాయని వివరించారు.కళాశాల ప్రిన్సిపల్ స్వాతి మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా వుంటూ చదువు మీద శ్రద్ధ పెట్టి తమ భవిష్యత్ ను చక్కగా మలచుకోవాలని తెలిపారు.కౌన్సిలింగ్ మొదలగు చర్యలు తీసుకొనుటకు తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిదంగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో పరిధిలోకి వొచ్చే నేరములను గురించి తమకు సమాచారం ఇవ్వాలని, 14500 టోల్ ఫ్రీ నెంబర్ కి కూడా తమ పిర్యాదు లను ఇవ్వొచ్చు అని తెలిపారు.ఈ కార్యక్రమం లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో కాస్టేబుల్ లు .బి. వి. సుబ్బయ్య,ఎస్. కె. పోలీస్ బాషా ,డి. ఎం. సి. రంగన్న తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో 2015-18 విద్యా సంవత్సరంలో బిఎ (హెచ్ఇపి) చదివిన విద్యార్థి గొట్టాల పవన్ యాదవ్ కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గుంటూరులో జరిగిన విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో బంగారు పతకం అందించడం జరిగింది. విశ్వవిద్యాలయ పరిధిలో ఆ గ్రూపులో మొదటి స్థానం సాధించినందుకు పవన్ కు ఈ బంగారు పతకం లభించింది. పవన్ యాదవ్ ఉలవపాడు మండలం ఎల్.రాజుపాలెం గ్రామానికి చెందినవాడు. టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు అన్ని రంగాలలోనూ ముందంజలో ఉంటారని, కళాశాల బోధనలోనే ఆ విధమైన అంతర్గత మెలకువలు నేర్పే కుశలత ఉందని కళాశాల ప్రిన్సిపల్ ఎం రవి కుమార్ ఈ సందర్భంగా తెలియజేశారు. పవన్ అభినందించిన ప్రిన్సిపల్,అధ్యాపక బందం తమ కళాశాలలో గడిచిన ఏడెనిమిది సంవత్సరాల్లో అనేకమంది విద్యార్థులు అఖిలభారత స్థాయిలో, రాష్ట్రస్థాయిలో , విశ్వవిద్యాలయ స్థాయిలో అనేక ర్యాంకులు సాధించారని తెలియజేశారు. ఈ ర్యాంకులు తమ బాధ్యతను మరింతగా పెంచుతున్నాయని, రాబోయే కాలంలో మరింత మెరుగైన తర్ఫీదుని అందించి విద్యార్థినీ విద్యార్థుల సర్వతోముఖాభివద్ధికి కళాశాల , అధ్యాపక బందం ప్రయత్నిస్తుందని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ తెలియజేశారు. కందుకూరు, పరిసర గ్రామాల విద్యార్థిని విద్యార్థులు ఈ కళాశాలలో చేరి,లభిస్తున్న మెరుగైన విద్యా సౌకర్యాలను అందుకోవాలని కోరారు.



విద్యుత్ అధికారులపై ధ్వజం

ప్రజాశక్తి-గుడ్లూరు

మండలంలో విద్యుత్ అధికారుల పనితీరు సక్రమంగా లేకపోవడంతో గ్రామాల్లో విద్యుత్తు సక్రమంగా సరఫరా కావడం లేదని విద్యుత్తు సమస్యపై ఎన్నిసార్లు అధికారులు దష్టికి తీసుకువచ్చిన పట్టించుకోవడంలేదని విద్యుత్ అధికారులపై సర్పంచులు, ఎంపీటీసీ , జెడ్పీటీసీ సభ్యులు ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పులి రమేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. మండలంలోని చేవూరు, తెట్టు, ఏలూరుపాడు, పొట్లూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు ట్రాన్స్ఫారాలు మరమ్మతలకు నోచుకోకపోవడంతో తరచుగా విద్యుత్తు సరఫరా కాకపోవడంతో పాటు లో వోల్టేజి సమస్య పట్టి పీడిస్తుందని చేవూరు ఎంపీటీసీ సభ్యులు నక్కల శ్రీనివాసులు, సర్పంచి వెంకటేశ్వర్లు అధికారుల దష్టికి తీసుకువచ్చారు. ఫలితంగా మంచినీటి పథకాలు పనిచేయకుండా నిలిచిపోవడంతో తాగునీటి సమస్య జటిలంగా మారిందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు .విద్యుత్ అధికారులకి ఎన్నిసార్లు సమస్య పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు .విద్యుత్ ఏ ఈ నిర్లక్ష్యం వలన విద్యుత్ సమస్యలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయని జడ్పిటిసి సభ్యులు కే బాబు రెడ్డి ఏఈ నిలదీశారు. దీంతో ఆగ్రహం చెందిన ఏ ఈ విద్యుత్ సమస్యలపై కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహేందర్ రెడ్డి కి తెలియజేసుకోండి అని చెప్పడంతో సభ్యులు ఎఇ పై అసంతప్తి వ్యక్తం చేశారు. వేలకు వేలు జీతాలు తీసుకుంటూ విద్యుత్తు సరఫరా చేయటంలో పట్టించుకోకపోవడం దారుణంగా ఉందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. జగనన్న కా లా నీ లా కి కూడా విద్యుత్తు లైన్లు మంజూరైన ఒక కాలనీ కి కూడా విద్యుత్తు సరఫరా చేయలేదని ఫలితంగా కాలనీలా నిర్మాణ పనులు ముందుకు సాగటం లేదని సభ్యులు తెలిపారు. విద్యుత్తు ఏ ఈ కి పనిచేసే ఉద్దేశం లేదని జడ్పిటిసి సభ్యులు అన్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సమావేశం తీర్మానించింది. ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే తగ్గిపోయిందని సాగు సీజన్ దాటిపోతున్న వర్షాలు పడడం లేదని ఉద్యానవన శాఖ అధికారి సభ దష్టికి తీసుకువచ్చారు. పంట పొలాల్లో సాగు నీరు నిల్వ కోసం భూగర్భ జలాలు పెంచుకోవడానికి వీలుగా రైతులు పనులు చేపట్టాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తామని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్య అధికారి డాక్టర్ మారుతీ రావు సభ్యుల దష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేస్తున్న డాక్టర్లు ఆరోగ్య శ్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య పిలుపు నిచ్చారు. బుధవారం నగరంలోని డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయ సమావేశ మందిరంలో కావలి, కందుకూరు, ఆత్మకూరు డివిజన్ వైద్యాధికారులకు, స్టాఫ్‌నర్సులకు, సీనియర్ అసిస్టెంట్లకు ఆరోగ్య శ్రీ పథకంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎం.పెంచలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పుల సంఖ్య పెంపుదల చేసేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, క్లస్టర్ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ప్రతి కాన్పును ఆరోగ్య శ్రీ పథకం క్రింద నమోదు చేసుకొని చికిత్సలు అందజేయాలన్నారు. అనంతరం ఆరోగ్య శ్రీ జిల్లా సమన్వయ కర్త డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పేద వర్గాలకు చెందిన గర్భిణీలు ప్రభుత వైద్యశాలల్లో కాన్పుల నిమిత్తం వస్తారని, అటువంటి వారికి నాణ్యమైన చికిత్సలు అందజేసి ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందజేసి తల్లి బిడ్డలను సంతోషంగా ఇంటికి పంపాలన్నారు. కార్యక్రమంలో డిఎల్ఎటిసిఓ డాక్టర్ ఖాదర్‌వల్లి, డిమో బి.శ్రీనివాసరావు, ఆరోగ్య శ్రీ బృందం తదితరులు పాల్గొన్నారు.

నూతన మోటారు సైకిల్ విడుదల

ప్రజాశక్తి-ఉలవపాడు: మండల కేంద్రం మైన ఉలవపాడు శరత్ మోటార్స్ హీరో షోరూం లో బుధవారం సరికొత్త గ్రామర్ మోటార్ సైకిల్ విడుదల చేయడం జరిగింది.ఈ ప్రారంభోత్స వానికి సింగరాయకొండ ఎంఇఓ బి శ్రీమన్నారాయణ మోటార్ సైకిల్ ను విడుదల చేశారు. కార్యక్రమంలో శరత్ మోటార్స్ అధినేత కె. సుబ్బారావు ,మండల పరిధిలోని మోటర్ సైకిల్ మెకానిక్ అధ్యక్ష కార్యదర్శులు సాంబశివ సాంబశివరెడ్డి, కాలేష సిబ్బంది ఫయాజ్, నజీర్, పూర్ణచంద్రరావు, జెట్టి శివకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






మాట్లాడుతున్న ఎంఎల్ఎ మహిధర్‌రెడ్డి

దేవాలయంలో ఎంఎల్ఎ పరిశీలన

ప్రజాశక్తి-కందుకూరు: కందుకూరు గ్రామ దేవత శ్రీ అంకమ్మ తల్లి విగ్రహ మహోత్సవం కార్యక్రమం సందర్భంగా బుధవారం అంకమ్మ తల్లి దేవాలయాన్ని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్ రెడ్డి ఆయనతో పాటు డిఎస్పి రామ చంద్ర పరిశీ లిం చారు. 7తేదీ జరిగే కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు.



నినాదాలు చేస్తున్న దృశ్యం

కందుకూరులో పెన్‌డౌన్ సమ్మె

ప్రజాశక్తి-కందుకూరు: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద బుధ వారం సమ్మె జరిగింది. రిజిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ వారు నూతనంగా ప్రారంభిస్తున్న కార్డ్ ప్రైమ్ 2.0 అనే నూతన సాఫ్టువేరు విధానం వల్లన దస్తావేజు లేఖరులు స్టాంప్ వెండార్స్ వారి జీవనోపాధి కోల్పోవడమే కాకుండా ఈ వత్తిపై ఆధారపడిన లక్షల మంది జీవనం కోల్పోతున్నారు. ఈ విధానం వల్లన దస్తావేజులకు ఎటు వంటి భద్రత లేదు. కనుక పాత విధానం లోనే కొనసాగించాలని కోరుతూ 30 , 31 తేదీలలో రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంఘం పిలుపు మేరకు పెన్ డౌన్ సమ్మె చేశారు.



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ముందస్తు ఎన్నికలకు బిజెపి రంగం సిద్ధం

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రస్తుతం దేశ వ్యాప్తంగా రాజకీయాలు చాలా వేగంగా ముందుకు పయనిస్తున్నాయని, ముఖ్యంగా నిన్నా, నేడు పలు పత్రికల్లో ప్రచురితమైన కథనాలను పరిశీలిస్తే బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ , బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌లు డిసెంబరులోనే ముందస్తు లోక్‌సభకు ఎన్నికలు వస్తాయని ప్రకటించారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్ర లో భాగంగా నెల్లూరు విచ్చేసిన రామకష్ణ బుధవారం నగరంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి వాస్తవానికి ఎన్‌డిఏ అన్న మాటను ఏనాడో వదిలేసిందన్నారు. బిజెపి పేరును సైతం వదిలేసి ఎంతసేపు మోడీ పేరు ప్రజలకు చెప్పి ఓట్లను అభ్యర్ధించాలని ప్రయత్నిస్తుందన్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల ప్రచార సమయంలో మోడీ ప్రధాని అన్న మాటను మరిచి తానే సిఎం అభ్యర్థిగా భావిస్తూ పర్యటించినప్పటికీ చిత్తు చిత్తుగా బిజెపి ఓటమి పాలైందన్నారు. ఆ ఓటమితో బిజెపి కళ్లు తెరిచిందన్నారు. అప్పుడు ఎన్‌డిఏ ఉందని, తమతో అన్ని పార్టీలు కలిసి పనిచేస్తున్నాయని సమావేశం నిర్వహించాయన్నారు. ఆ సమావేశంలో కొన్ని పార్టీలు హాజరు కాలేదన్నారు. ఒక ఎంఎల్ఎ, ఒక ఎంపి హాజరు కాలేదన్నారు. అటువంటి పార్టీలను ఈ సమావేశాలకు ఆహ్వానించి ప్రధాన మంత్రి పక్కన చోటిచ్చారన్నారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలకు సమయాత్తం కావాలని, తిరిగి మూడవ సారి మరలా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. . ఒంగోలు సమీపంలోని గుండ్లకమ్మ ప్రాజెక్టుకు సంబంధించిన ఒక గేటు ఏర్పాటు చేసేందుకు రూ.2 కోట్లు నిధులు కేటాయించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. ఇప్పటి ఆరు సార్లు టెండర్లు పిలిచినా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఒక్కరు ముందుకు రాలేదని, దీనిని పరిశీలిస్తే ప్రభుత్వం పాలన ఏవిధంగా ఉందో అర్థమౌతుందన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి దామ అంకయ్య మాట్లాడుతూ జిల్లాలోని కందుకూరుకు నియోజకవర్గంలోని రామాయపట్నంపోర్టు నిర్మల విషయంలో స్థానికులకు రావాల్సినటువంటి వనరుల సమకూర్చకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. సమావేశంలో సిపిఐ నెల్లూరు జిల్లా సహాయ కార్యదర్శి పి మాలకొండయ్య, నగర సిపిఐ కార్యదర్శి అరిగెలసాయిలు పాల్గొన్నారు.

దొంగలు బాబోయ్..దొంగలు

ప్రజాశక్తి నెల్లూరు సిటీ..

రెక్కాడితే గాని డొక్కాడని చిరు వ్యాపారులకు దొంగల భయం పుట్టుకుంది. ఏ రోజుకు ఆరోజు అన్నట్టుగా వారి నుండి తప్పించుకుంటే చాలన్న పరిస్థితి నెలకొంది. ఆ వివరాల్లోకి వెళ్ళితే.. నెల్లూరు పట్టణం చిన్న బజారులో పండ్ల వ్యాపారం సాగుతుంది. చిరు వ్యాపారులు అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత బజారుకు వెళ్లి వారికి కావాల్సిన పండ్లను తీసుకొని వచ్చి ఉదయాన్నే పట్టణంతోపాటు చుట్టుప్రక్కల గ్రామాల్లో అమ్ముకునేవారు. ఈ కోవలో ఒంటి గంట తర్వాత జరిగే చిన్న బజారుకు వెళ్లి తెచ్చుకోవాలి వస్తుంది. ఈ కోవలో భాగంగా విజయ మహల్ గేటు బ్రిడ్జి క్రింద, ముత్తరాజు వీధి ప్రాంతాల గుండా వెళ్లాల్సి వస్తుంది. అయితే ఆ ప్రాంతంలో మాట వేసిన దొంగలు అదును చూసుకొని ఆ దారిని వెళ్లే వ్యాపారస్తులపై దాడి చేసి వారి వద్ద ఉన్న డబ్బులు లాక్కుంటున్నట్లు సమాచారం. దీంతో వ్యాపారులు తమ కావాల్సిన సరుకులు కొనలేక లబోదిబోమంటూ ఇంటికి తిరిగి వస్తున్నారు. ఈ సంఘటనలో బాధితులు ఎక్కువ సంఖ్యలోనే ఉన్నట్లు తెలుస్తుంది. సంబంధిత ఉన్నతాధికారులు ఆ ప్రాంతంలో నిఘా పెట్టి దొంగల బెడద నుండి వ్యాపారులను, సామాన్య జనాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

స్కూల్లో తహశీల్దారు పరిశీలన



ప్రజాశక్తి-సంగం : స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో తహశీల్దార్ నాగరాజు బుధవారం సందర్శించి, పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యా బోధన తీరు గురించి ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్యను అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధన సక్రమంగా జరుగుతుందా లేదా అనే విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న మెడికల్ క్యాంపును పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

బుద్ధుడి విగ్రహం ఆవిష్కరణ



ఎంఎల్‌ఎను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు : గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు స్వతంత్ర పార్కులో పునర్నిర్మాణమైన బుద్ధుని విగ్రహాన్ని బుధవారం నెల్లూరు నగర ఎంఎల్‌ఎ డాక్టర్ పి.అనిల్‌కుమార్ ఆవిష్కరించారు. గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అరవ రాయప్ప, ప్రధాన కార్యదర్శి కె.వి.రమణయ్య, ట్రెజరర్ నరాల పళణి, గౌరవ అధ్యక్షులు డాక్టర్ రాచపాళెం రఘు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేలూరు ఉమా మహేశ్, ఇంటర్ నేషనల్ వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి, ఎన్ బలరామ నాయుడు, శ్రీమన్నారాయణ, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హోంగార్డు మృతికి సిఐ సంతాపం



ప్రజాశక్తి-ఉదయగిరి : హోంగార్డుగా విధులు నిర్వహించిన రబ్బాని పాడెను సిఐ గిరిబాబు మోశారు. స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తూ ఫిరోజ్ అలీ అలియాస్ రబ్బాని అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం సిఐ గిరిబాబు, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం రబ్బాని పాడెను సిఐ గిరిబాబు శ్మశానం వరకు మోసి సిబ్బందిపై ఉన్న తమ ప్రేమను తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు స్థానికులు పలువురు సిఐ సహృదయానికి అభినందనలు తెలిపారు.

రామ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆటలపోటీలు


ప్రజాశక్తి-కావలి : డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన గేమ్స్ పోటీలలో విద్యార్థులు పోటాపోటీగా, హోరాహోరీగా తలపడ్డారు. విశ్వోదయ స్వాప్నికుడు డి.ఆర్ పేరుపై విశ్వోదయ డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో డాక్టర్ డి.ఆర్. బాలల దినోత్సవం 2023 రెండవ రోజు వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ గేమ్‌లలో పోటీలు జరిగాయి. కావలి నియోజకవర్గ పరిధిలోని కావలి మండలం, బోగోలు మండలం, అల్లూరు మండలం, దగదర్తి మండలం నాలుగు మండలాలకు చెందిన షుమారు 50 పాఠశాలల విద్యార్థులు పోటాపోటీగా తలపడ్డారు. రసవత్తరంగా జరిగాయి. రెక్టార్ దొడ్ల వినయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ కూనం తాతి రెడ్డి, ప్రిన్సిపాల్ ఇన్‌ఛార్జి మాలియాద్రి, పి.డి ప్రసాద్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు.

పలుచోట్ల రక్షా బంధన్ వేడుకలు

ప్రజాశక్తి-కావలి : శారీరక, మానసిక వికలాంగుల భవితకు భరోసా కల్పిస్తామని, అండగా నిలుస్తామని సంకల్పిస్తూ రాఖీలు కట్టాలని ఎపిఎస్ ఆర్‌టిసి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక తుమ్మలపెంట రోడ్డులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో సక్షం ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.5వేల విలువైన ఆటవస్తువులు కేంద్రానికి బహూకరించడంతో పాటు, కేంద్రంలో శిక్షణ పొందుతున్న బాలలకు రక్షలు కట్టి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్‌టిసి డిఎం మాట్లాడుతూ సమాజంలోని అన్నీ వర్గాల వారితో సహా వికలాంగులు కూడా అభివృద్ధి చెందడానికి కృషి చేయాలన్నారు. సక్షం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ దేశంలోని మూడు కోట్ల మంది, 12 రకాల అంగవైకల్యం కలిగిన వికలాంగుల సమగ్రాభివృద్ధికి సక్షం కృషి చేస్తుందన్నారు. సక్షం కావలి శాఖ బాధ్యులు మంగళగిరి వేణుగోపాల్ రావు, నాగమణి మాట్లాడుతూ భవిత కేంద్రాలలో శిక్షణ పొందుతున్న బాలలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దినేష్, మోహన్ రెడ్డి, ఇతర రొటేరియన్లు గోపీక్రిష్ణ, సలీం బేగ్, సదరన్ ఉద్యోగి భాస్కర్ రావు, సక్షం అల్లూరు మండల కన్వీనర్ రమణయ్య, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : సోదర భావం భావంతోటి ప్రజలలో అనుబంధాలు పెరుగుతాయని శాంతియుత జీవితం కలుగుతుందని బ్రహ్మకుమారి సుమతి అన్నారు. బుధవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆత్మకూరు పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి రాఖీ కట్టి స్వీట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నా, చెల్లెళ్లు లేదా అక్క తమ్ముళ్లు లేదా మధ్యన మధ్యన ప్రేమానురాగాలకు సూచికంగా ఈ పండుగ జరుపుకుంటామని తెలిపారు. అన్నకు ప్రేమ సూచికంగా సోదరి కట్టే రాఖీ అని పిలిచే ఒక పట్టీని కట్టడం ఈ పండుగ ప్రాధాన్యత అని ఆమె అన్నారు. చెల్లి తన అన్నయ్య మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటారని తెలిపారు.

పెళ్లి వేడుకల్లో ఎంపిపి తూమాటి



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : చేజర్ల మండలంలోని కాకివాయి గ్రామంలో బుధవారం పలు పెళ్లి వేడుకల్లో ఎంపిపి తూమాటి విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. చేజర్లకు చెందిన విద్యుత్ శాఖ లైన్‌మెన్ అల్లం శేషారెడ్డి కుమార్తె పెళ్లి వేడుకల్లో పాల్గొని వధువు శాంతి ప్రియని ఆశీర్వదించారు. అలాగే కాకివాయికి చెందిన వడ్లమూడి వెంకటేశ్వర్లు కుమారుడు వెంకట దిలీప్ పెళ్లి వేడుకల్లో పాల్గొని వరుడును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాలలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గోతం వెంకటసుబ్బయ్య యాదవ్, చేజర్ల వైస్ సర్పంచ్ ఉడత పుల్లయ్య యాదవ్, చేజర్ల సచివాలయం కన్వీనర్ పాలకొండ వెంకటరామిరెడ్డి, వార్డు సభ్యులు పంబేటి సుధీర్ కుమార్ రెడ్డి, కాకివాయి బాబు నాయుడు, పుల్లారెడ్డి, సంజీవయ్య తదితరులున్నారు.

జెడ్‌పి చైర్మన్ అరుణమ్మకు అభినందనలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : చేజర్ల మండలంలో అభివృద్ధి పనుల కోసం ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి సూచన మేరకు జెడ్‌పి చైర్మన్ ఆనం అరుణమ్మ ఆదురుపల్లి గ్రామంలో శ్మశాన వాటిక బిట్ -1, బిట్ -2 లకు గాను రూ.8 లక్షలు, చేజర్లలో జెడ్‌పి అతిథి గృహం అభివృద్ధి కోసం రూ.5లక్షలు, ఓబులాయపల్లి గ్రామంలో తాగునీటి కోసం హ్యాండ్ బోర్ కు రూ.2.60 లక్షలు పాతపాడు గ్రామంలో హ్యాండ్ పంప్ కోసం రూ.1.30 లక్షలు ఆదూరుపల్లిలో హ్యాండ్ పంప్ కోసం రూ.1.30లక్షలు మొత్తంగా రూ.18.20లక్షలు మంజూరు చేశారు. చేజర్ల జెడ్‌పిటిసి పీట్ల పార్థసారథి జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మకు, ఆత్మకూరు ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

పలుచోట్ల విద్యుత్‌షాక్‌తో ఇద్దరు మృతి

క్రైం కార్నర్

ప్రజాశక్తి-వరికుంటపాడు : ఇనుప దోటితో మేకలకు మండ కొస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టుపైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి విద్యుత్ షాక్‌గురై అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని ఆశోక్ నగర్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పామూరు మండలం తిరగదిన్నె గ్రామానికి చెందిన గుజ్జల పెద్ద వెంగయ్య (52) సమీపంలోని ఆశోక్ నగర్‌కు వచ్చి మేకలకు మండ కోస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దాంతో విద్యుత్ షాక్ తగిలి ఆయన అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. గమనించిన కొంతమంది కుటుంబ సభ్యులకు తెలపడంతో హుటాహుటిన అక్కడికి చేరుకునేసరికి ఆయన మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్య ఉంది. పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి-కావలి రూరల్ : పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఆపడానికి వెళ్లిన వ్యక్తి కరెంట్ షాక్ కొట్టి మృతి చెందిన ఘటన కావలి మండలం పరిధిలోని పెద్ద పట్టుపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. మృతుడు ఆవుల తోపయ్య సముద్రంలో చేపల వేట జీవనం సాగిస్తుంటాడు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. బుధవారం 8 గంటలకు వాళ్ల పొలంలో ఉన్న కరెంటు మోటారుకు కరెంటు సప్లయి వస్తుందా లేదా అని ఉన్న ట్రాన్స్‌ఫార్మరును ఆపడానికి ప్రయత్నించగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి భార్య ఆవుల విజయమ్మ పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చింది. రూరల్ ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

సముద్రంలో చిన్నారి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ వద్ద బుధవారం గుర్తుతెలియని 6-7 చిన్నారి మృతదేహం లభ్యమైంది. వేటకు వెళ్లిన జాలర్లకు కనిపించడంతో బిట్రగుంట పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఎస్ఐ శీలా భాస్కర్, సిఐ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం కావలికి పంపించినట్లు స్థానికులు తెలిపారు.

మరో కేజీఎఫ్‌లా రుద్రకోట చెరువు

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న రుద్రకోట గ్రామస్తులు

కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, ఆయన అనుచరులు తమ గ్రామంలోనూ, చెరువులోనూ అక్రమంగా రోజుకు 1000 ట్రక్కుల గ్రావెల్ తరలిస్తు, మరో కేజీఎఫ్‌లా మార్చేస్తున్నారని రుద్రకోట గ్రామస్తులు ఆరోపించారు. బుధవారం స్థానిక పి.ఎస్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్లెపల్లెకు పసుపులేటి కార్యక్రమంలో భాగంగా సుధాకర్ తమ ఊరు వచ్చారన్నారు. తాము, తమ గ్రామస్తులు గ్రావెల్ గురించి పసుపులేటికి తెలియజేశామన్నారు. రోజుకు వెయ్యి టిప్పర్లు అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారన్నారు. ప్రశ్నించిన గ్రామస్తులపై అక్రమ కేసులు పెట్టారని వాపోయారు. వీరి వేధింపులను తట్టుకోలేక ఊరు వదిలి యువత వెళ్లిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పసుపులేటికి చెప్పిన వెంటనే ఆయన గ్రావెల్ తవ్వే ప్రాంతాన్ని పరిశీలించారన్నారు. లోడ్ చేసేందుకు వెళుతున్న టిప్పర్‌ను ఆయన పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పారన్నారు. తమకు అండగా ఉన్న నాయకుడి గురించి మాట్లాడటం దుర్మార్గమన్నారు. రాత్రికిరాత్రి ఇష్టప్రకారంగా తవ్వకాలు చేసేస్తున్నారని ఆరోపించారు. పిఎస్‌ఆర్ ట్రస్ట్ సభ్యులు గుంజి ప్రసన్న మాట్లాడుతూ గ్రావెల్ తవ్వకాలపై ఫిర్యాదు చేస్తే ఎంఎల్‌ఎ అనుచరులు నోటికొచ్చినట్లుగా మాట్లాడుతున్నారన్నారు. ఈ వైసిపి నాయకులకు సిగ్గుందా అని అడుగుతున్నామన్నారు. గడప గడపకు తిరగడం కాదు.. ఇక్కడ గ్రావెల్ మాఫియా ఆగడాలను పరిశీలించామని పసుపులేటి సుధాకర్ అడిగారన్నారు. 2014 ఎన్నికలకు ముందు ఎంఎల్‌ఎ ప్రతాప్‌రెడ్డి ఎక్కడ ఉన్నారో వైసిపి నేతలు గుర్తుతెచ్చుకోవాలన్నారు. రాజకీయాల్లోకి రాకముందు సొంత నిధులతో నియోజకవర్గంలో తమనేత సామాజిక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. గ్రామాల్లో విద్యుత్ దీపాలు, బోర్లు, మంచినీటి ప్లాంట్‌లు, పేదలకు చేయూత అందించిన నేత పసుపులేటి అని అన్నారు. ఎమ్మెల్యే సొంత నిధులతో ఏమిచేశారో.. చెప్పాలని సవాల్ విసిరారు. గ్రావెల్ మాఫియాను పసుపులేటి టీమ్ అడ్డుకుంటుందన్నారు. విమర్శలు కాకుండా, 24 గంటల్లో ఎప్పుడైనా రుద్రకోట చెరువుకు వెళదాం రండి అని ఎంఎల్‌ఎకు తెలియజేశారు. కార్యక్రమంలో పిఎస్‌ఆర్ ట్రస్ట్ సభ్యులు, రుద్రకోట గ్రామస్తులు పాల్గొన్నారు.



'కాలంపై కవాతు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ధరల పెరుగుదలపై సిపిఎం సదస్సు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన అధిక ధరలను తగ్గించాలని బుధవారం పట్టణంలోని చర్లో రమణారెడ్డి భవన్‌లో సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు అధ్యక్షతన పార్టీ నాయకులతో కార్యకర్తలతో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డేవిడ్ రాజు, జిల్లా కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి గంటా లక్ష్మీపతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సిపిఎం సమరభేరి కార్యక్రమాన్ని 30వ తేదీ నుండి సెప్టెంబర్ నాలుగు వరకు అధిక ధరలపై సమరభేరి నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి గ్రూప్ మీటింగులు, ఇంటింటికి తిరిగి సంతకాల సేకరణ సచివాలయాలకు అర్జీలు నిరుద్యోగులతో సమావేశం మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సమలభేరిని నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం ఉన్నం వెంకటేశ్వర్లు రచించిన 'కాలంపై కవాతు' కవిత ఆలోచన పుస్తకాన్ని సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. పుస్తకం గతంలో ప్రజాశక్తి సబ్ ఎడిటర్‌గా జర్నలిజం క్లాసులకు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. ఆయన గతంలో ఎదురీత పుస్తకాన్ని కూడా రాశారు. ఇది రెండో పుస్తకాన్ని రాయడం విశేషం. సిఐటియు మండల అధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య, ఎపి రైతుసంఘం మండల ప్రధాన కార్యదర్శి లక్కు కృష్ణప్రసాద్, సిపిఎం నాయకులు ఆళ్ల హజరత్తయ్య, యుటిఎఫ్ నాయకులు నంద శీను, గద్దర్ బాబు, కొండా లక్ష్మమ్మ, రమణయ్య తదితరులున్నారు.

'పది' విద్యార్థులు ర్యాంక్ సాధించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి



పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న విద్య జిల్లా ర్యాంక్ వచ్చేలా సులభతరహాలో బోధించాలని ఉపాధ్యాయులకు ఎంఇఒ-2 తోట శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండల పరిధిలోని జెడ్.పి. హెచ్.ఎస్. ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల పాఠ్యాన్ని పరిశీలించి పలు సూచనలు సలహాలు చేశారు. ప్రతి ఉపాధ్యాయులు ప్రభుత్వ స్కూల్లో అందిస్తున్న విద్య నాణ్యమైనదని నిదర్శనానికి ఈ ఏడాది కూడా జిల్లా ర్యాంక్ వచ్చేలా ప్రతి విద్యార్థినిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి ముఖ్యమంత్రి ఆశించిన ఫలితాలను తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మావులూరి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ పుష్ప రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



ఓటర్ల జాబితాలో డెత్, డబుల్ ఎంట్రీ తొలగించిన ఓట్లు అధికంగా ఉండడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కలెక్టర్ సుధాకర్ పట్టణంలోని ఓటర్ల జాబితాను పరిశీలించారు. బుధవారం ఆత్మకూరు తహశీల్దార్ కార్యాలయంలో లక్ష్మీ నరసింహంతో కలిసి బిఎల్ఒలు చేసిన ఓటర్ వెరిఫికేషన్ రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం బిఎల్ఒతో కలిసి పట్టణంలోని జెఆర్ పేటలోని కొన్ని ఓటర్ల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడి, డెత్, డబుల్ ఎంట్రీ ఓట్లు తొలగిస్తున్నామని తెలిపి వారి దగ్గర సంతకాలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ సుధాకర్ మాట్లాడుతూ 6/1/22 ఓట్లు డిలీట్ చేసిన ఓటర్ల జాబితాలో ఆత్మకూరులోని సుమారు 6385 ఓటర్లు డిలీషన్లు ఉన్నాయని వాటిని చట్ట ప్రకారమే తొలగించినట్లు తెలిపారు. అయితే జిల్లా కలెక్టర్ ఫీల్డ్‌కు వెళ్లి కనీసం 500 రికార్డులు వెరిఫికేషన్ చేయాలని సూచించడంతో అందులో భాగంగా ఆత్మకూరు, సంగం ప్రాంతాలలో ఈ ఓటర్ల వెరిఫికేషన్ చేశామని ఆయన తెలిపారు.

ప్రజాశక్తి-సంగం : స్థానిక సచివాలయం-3లో ఓట్ల తొలగింపుపై బుధవారం స్పెషల్ ఆఫీసర్ ఎం.వి.సుధాకర్ ఓటర్ల జాబితాను పరిశీలించారు. తొలగించిన ఓట్లపై గ్రామంలో ఫీల్డ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా తొలగించిన ఓటర్ల ఇళ్ల వద్దకు స్వయంగా వెళ్లి తనిఖీ చేశారు. ఓటు తొలగింపుపై ఓటర్‌కు క్షుణ్ణంగా ఎందుకు తొలగించారో వివరించి వారి అంగీకారం తీసుకున్నారు. ఆత్మకూరు నియోజకవర్గం మొత్తం తొలగించిన ఓట్లపై ఫీల్డ్ విజిట్ చేస్తున్నామని ఆయన తెలిపారు.

99వేల గడపలు పూర్తి.. : నల్లపరెడ్డి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం

గడపగడపకు మన ప్రభుత్వం పాదయాత్ర బుధవారంతో 99 వేలు గడపలు పూర్తి చేసుకున్నట్లు కోవూరు ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన బుచ్చి నగర పంచాయతీలోని పంచేడు గ్రామంలో ప్రతి గడపకు తిరిగి ప్రజలకు అందిన సంక్షేమానికి సంబంధించి పత్రాలు అందజేశారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ అవసరమైన వారికి తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామాల సచివాలయాల్లో ఇప్పటివరకు 25,700 పైగా గడపగడపకు తిరిగి ప్రభుత్వ పథకాల గురించి వివరించడం ప్రజల సమస్యలు తెలుసుకోవడం జరిగిందన్నారు. బుచ్చిరెడ్డిపాలెం రూరల్ పరిధిలోని 13 సచివాలయాల్లో 13 వేలకు పైగా గడపలు తిరిగామన్నారు. నగర పంచాయతీలోని 10 సచివాలయాల పరిధిలో 12726 గడపలు తిరిగినట్లు తెలిపారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పంచేడు సచివాలయానికి రూ.20 లక్షలు అభివృద్ధి కార్యక్రమాలకు అందజేశారన్నారు. నాలుగు కోట్ల అరవై లక్షల రూపాయలు బుచ్చి నగర పంచాయతీలు అందజేసినట్లు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సహకరించిన నాయకులు అధికారులు వలంటీరీలు ప్రజలకు పాదాభివందనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు తమకు బ్రహ్మరథం పడుతూ హారతులు ఇస్తున్నారన్నారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు ప్రభుత్వం ద్వారా తమకు అందిన లబ్ధికి ఎంతో సంతోషపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సురా శ్రీనివాసులు రెడ్డి, సురా ప్రదీప, మోర్ల సుప్రజ, మోర్ల మురళి, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు, నల్లపరెడ్డి రంజిత్ కుమార్ రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్ రెడ్డి, యానాద్ రెడ్డి, అందే ప్రత్యూష, అనంతమ్మ, సర్పంచ్ వెంకటరమణారెడ్డి, యానాది రెడ్డి తదితరులు ఉన్నారు.

చిన్నారులకు ఎన్ఎస్ఆర్ ట్రస్ట్ అండ..

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుచ్చినగర పంచాయతీలోని 19వ వార్డులో పర్యటిస్తుండగా కొన్ని కుటుంబాల్లో కొంతమంది తల్లిని కొంతమంది తండ్రిని కోల్పోయిన పిల్లలకు చూసి వారి భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని వారి భవిష్యత్తుకు బాట వేయాలని ఆలోచనతో ఎన్ఎస్ఆర్ ట్రస్ట్ తరఫున ఆ చిన్నారులకు కోవూరు ఎంఎల్‌ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అండగా నిలిచారు. ఈ సందర్భంగా వవ్వేరు 19వ వార్డుకి చెందిన ఆర్.శ్యామలకు రూ.20 వేలు, ఆర్.అభిరామ్ కు రూ.20 వేలు, నాగ చైతన్యకు రూ.20 వేలు, నాగ ప్రసన్నకు రూ.20 మొత్తం రూ.80 వేల తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆ పిల్లలకు 18 సంవత్సరాలు వచ్చేంత వరకు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి 19వ వార్డు కౌన్సిలర్ కోటంరెడ్డి లలిత రెడ్డి, కోటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, బుచ్చి మండల పార్టీ అధ్యక్షులు చెర్లో సతీష్ రెడ్డి సమక్షంలో ఆ పత్రాలను వారి కుటుంబ సభ్యులకు అందజేసి వారికి పెద్ద దిక్కుగా నిలబడ్డారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



బుక్కాపురంలో 'కాకర్ల' వైద్య సేవలు

ప్రజాశక్తి-ఉదయగిరి

వింజమూరు మండల పరిధిలోని బుక్కాపురంలో నియోజకవర్గ టిడిపి నాయకులు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ ఎన్‌టిఆర్ సంజీవని రథం ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య సేవను నిర్వహించారు. బుధవారం వింజమూరు మండలం బుక్కాపురం రామాలయం వద్ద అనారోగ్య సమస్యలు ఉన్న గ్రామస్తులకు ఉచితముగా వైద్య పరీక్షలు చేసి ఉచిత మందులు పంపిణీ చేశారు. 123 మంది గ్రామస్తులను డాక్టర్లు వివిధ ఆరోగ్య సమస్యలను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు వైద్య శిబిరాన్ని సందర్శించి సంజీవని ఆరోగ్య రథం అందిస్తున్న వైద్య సేవలను గ్రామస్తుల నుండి అభిప్రాయాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై గ్రామంలోని సమస్యలపై చర్చించారు. మహిళల అభివృద్ధి తమ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేశారు. మహిళలకు బ్యూటిషన్ 20 మంది టైలరింగ్ 25 మంది రెండో బ్యాచ్‌గా శిక్షణ ఇస్తున్నామని అన్న క్యాంటీన్ 127వ రోజు 630 మంది తమ ఆకలిని తీర్చుకొన్నారాన్నారు.

భోజన ప్యాకెట్లు వితరణ

ప్రజాశక్తి-కావలి

నెల్లూరు పట్టణం నివాసులు వై.రాజేష్ కుమార్ రెడ్డి - గీత దంపతుల కుమార్తె చిన్నారి వై.పూజ్యశ్రీరెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ద్వారా బుడంగుంట గిరిజన ప్రాంతంలో ఉన్న పిల్లలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా పేద పిల్లలకు భోజనం ఏర్పాటు చేసిన నేటి దాతలు వై.రాజేష్ కుమార్‌రెడ్డి - గీతదంపతులకు ధన్యవాదాలు తెలిపారు. పుట్టినరోజు జరుపుకుంటున్న చిన్నారి పూజ్య శ్రీ రెడ్డికి సంయుక్త సేవా సంస్థ ద్వారా హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇలాంటి పుట్టినరోజు రోజులు మరెన్నో జరుపుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నామని తెలిపారు.

చిన్నపాటి వర్షానికే జలమయం

- పెద్దిరెడ్డిపల్లి బిసి కాలనీలో ఇదీ పరిస్థితి..

ప్రజాశక్తి-వరికుంటపాడు



మండలంలోని పెద్దిరెడ్డిపల్లి బుధవారం కురిసిన వర్షానికి గ్రామమంతా జలమయమైంది. అందులో భాగంగా స్థానిక బిసి కాలనీ పరిస్థితి మరి అధ్వానంగా తయారైంది. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేక, అంతర్గత రోడ్లు అసలే లేకపోవడంతో వర్షపు నీరు మొత్తం ఇళ్ల మధ్య నిలిచిపోయాయి. కాలనీ చుట్టూ నీరు నిలిచి ఉండడంతో ప్రజలు రాకపోకలు చేయలేకపోతున్నారు. అలాగే నీరు బయటకు పోవడానికి ఎలాంటి ఏర్పాటు లేకపోవడంతో నీళ్ల మధ్యనే గడపాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతానికి సిమెంట్ రోడ్లు కానీ, పటిష్టమైన అంతర్గత రోడ్లు కానీ లేని కారణంగా వర్షం వస్తే చాలు తమ పరిస్థితి చాలా అధ్వానంగా తయారవుతుందని పలువురు గృహిణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, చిన్న పిల్లల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఈ విషయంపై ఎన్నిసార్లు పంచాయతీ పాలకులకు తెలిపిన ఫలితం లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. కొద్దిపాటి వర్షానికే కాలనీ జలమయం అవుతుండడంతో దిక్కుతోచని స్థితిలో ప్రజలు విలవిలలాడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ కాలువలను ఏర్పాటు చేసి కాలనీ ప్రజలను ఆదుకోవాలని కోరుతున్నారు.

డాక్యుమెంట్ రైటర్స్‌కు మాలేపాటి సంఘీభావం

ప్రజాశక్తి-కావలి



కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా జరుగుతున్న డాక్యుమెంట్ రైటర్స్, వెండర్స్ దీక్ష శిబిరాన్ని బుధవారం కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు సందర్శించి వారికి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ లక్షలాదిమంది జీవితాలతో ఆటలాడుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చివరి దశలో ఉన్నారని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే తమ వృత్తికి ఎటువంటి ఆటకం కలగకుండా చర్యలు చేపడతామని వారికి హామీనిచ్చారు. తమ పోరాటానికి అవసరమైన సహాయ సహకారాలు అందించి, వారికి సంఘీభావం తెలుపుతూ... అండగా ఉంటానన్నారు.




ఘనంగా విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-కావలి

కచ్చిరిమిట్టలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ విద్యా గణపతి దేవస్థానంలో బుధవారం విద్యా గణపతి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా స్వామి వారికి పాలు, తేనె, పెరుగుతో అభిషేకం చేశారు. అనంతరం కుంబాభిషేకం నిర్వహించారు. తదుపరి తిరువీధి ప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అన్నవరం సత్యనారాయణ. తిరువీధి బ్రహ్మయ్య, తిరువీధి ప్రసాద్, హనుమకుమార్, కాంతారావు, నరహరి హరిబాబూ, ఆవులమంద శ్రీనివాసరావు, సురేష్, రామకృష్ణ, రూపేష్, మధు, ఆలయ అర్చకులు, బుట్ట శేషచార్యులు, వేద పండితులు అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-జలదంకి : జలదంకి, కావలి మండలాల్లోని తెలుగు, గణితశాస్త్రం ఉపాధ్యాయులకు జలదంకి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, బ్రాహ్మణ క్రాక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. జలదంకిలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పాఠ్యాంశంపై శిక్షణను ఇచ్చారు. అలాగే బ్రాహ్మణక్రాక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్రం పాఠ్యాంశంపై శిక్షణను ఇచ్చారు. 2024లో జరిగే పరీక్ష పత్రాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మాదిరి ప్రశ్నాపత్రంపై తెలుగు ఉపాధ్యాయులు ఐఎఫ్‌పి ప్యానల్‌పై ఏ రాజయ్య అవగాహన కల్పించారు. జలదంకి కాంప్లెక్స్‌లోని ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఇందులో ఐఎఫ్‌పి ప్యానల్ ద్వారా మాదిరి పాఠం బోధన విధానంను వీడియోల ద్వారా ప్రదర్శించారు. సమావేశంలో జలదంకి కాంప్లెక్స్ చైర్మన్ వై.కొండారెడ్డి, బ్రాహ్మణక్రాక కాంప్లెక్స్ చైర్మన్ పి రమేష్, (సిఎంఆర్ టి) క్లస్టర్ మొబలైజ్ రిసోర్స్ టీచర్స్ పి.రవిచంద్ర, డి.శ్రీనివాసులు, డి.కొండయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఎంఆర్‌పిఎస్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కొండాపురం

జిల్లా ఎంఆర్‌పిఎస్ ఇన్‌ఛార్జి ఎస్.వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల నూతన కన్వీనర్‌గా గోసాల సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అని తెలిపారు. మండల అధికార ప్రతినిధిగా మంద డేవిడ్, కో కన్వీనర్‌గా కె మహేష్, జి రాజేష్ ప్రధాన కార్యదర్శిగా రొడ్డ జకరయ్యను తెలిపారు. మొత్తం 19 పంచాయతీలను మాదిగలతో సమావేశం నిర్వహించి వీరిని ఎందుకు చేసినట్లు తెలిపారు. రాబోయే కాలంలో ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీ ద్వారా గ్రామాలలో కమిటీలు ఏర్పాటు చేసి ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు ఎలా చూడాలన్నారు. ఈ సందర్భంగా దళిత ఇటీవల కాలంలో మరణించిన మాజీ మండల కన్వీనర్ గోశల కోటేశ్వరరావు బంక ఆనందరావు మాదిగలకు సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంఆర్‌పిఎస్ నాయకులు గోసిపాపల వెంకటేశ్వర్లు మాదిగ, జిల్లా మహాజన సోషలిస్ట పార్టీ మండల కన్వీనర్ అంబేద్కర్ మాదిగ, మండల సీనియర్ నాయకులు ఆశీర్వాదం పదా చిన్న, మాజీ మండల్ కన్వీనర్ జడ ఫిలిప్, బండారు చంద్ర రవి, దొడ్డ ప్రేమ్ కుమార్, తదితర నాయకులు పాల్గొన్నారు.

'ప్రకాశం'లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-కందుకూరు



ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఎం.కోర్ ప్రైవేట్ లిమిటెడ్,బెంగళూర్ సంస్థ ప్రాంగణ ఎంపికల ప్రారంభోత్సవ కార్యక్రమంలో కళాశాల టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కంచర్ల విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ సాఫ్ట్వేర్ పరిశ్రమ రంగం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఈ తరుణంలో ప్రకాశం విద్యార్థులు కోర్ మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగవకాశాలు మెరుగు పరిచేందుకు ఆన్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కోర్ కంపెనీలలో మంచి జీతభత్యాలతో భవిష్యత్తులో ఉన్నత స్థాయిని చేరుకునేందుకు పుష్కల అవకాశాలు ఉన్నాయన్నారు. వాటికి తగినట్టుగా ప్రకాశం విద్యార్థులు యాజమాన్యం అందించే అవకాశాలను ఉపయోగించుకుంటారని విశ్వాసాన్ని ఆయన వ్యక్తపరిచారు.

నదిలా సాఫీగా సాగిపోయే కోర్ జాబ్స్ : కోర్ ఇంజనీరింగ్ జాబ్స్ ఎల్లప్పుడూ సాఫీగా సాగిపోయేలాగా ఉంటాయని, విద్యార్థులు తమ కోర్ ఇంజనీరింగ్ అకడమిక్స్ బేసిక్స్ నందు శ్రమించి బాగా చదివి పట్టు సాధిస్తే పుష్కల ఉద్యోగ అవకాశాలు పరిశ్రమల నందు ఉన్నాయని ఎం.కోర్ డైరెక్టర్ సాయి శ్రీనివాస్ చెప్పారు. మార్కెట్లో ఎంబెడెడ్ సిస్టమ్స్ లేకుండా ఏ ఎలక్ట్రానిక్ ఉత్పత్తి లేదని, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎంబెడెడ్ సిస్టమ్స్ ఇంజనీర్స్ గా పుష్కల అవకాశాలు ఉన్నాయన్నారు. ఎంబెడెడ్ సిస్టమ్స్ పరిశ్రమ 2023 చివరి నాటికి 32 వేల బిలియన్లకు చేరబోతుందని శ్రీనివాస్ అన్నారు.తమ ఈ.ఈ.ఈ , ఈ.సి.ఈ విద్యార్థులకు తరగతి గది విద్యతో పాటు లేబరేటరీ లో సమర్ధ బోధనను అందించి వారి ప్రయోగాత్మక నైపుణ్యాలను మెరుగయ్యేలా ఒక ప్రణాళిక ప్రకారం తమ కాలేజీలో బోధన చేయడమే తమ లక్ష్యమని అకాడమిక్ ఇంచార్జ్ ఎస్.ఎన్ మీరావలి అన్నారు. దానికి తగినట్టుగా విద్యార్థులు కాలేజీ యాజమాన్యం ఇచ్చే ప్రోత్సాహాన్ని వినియోగించుకుంటారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్ రవికుమార్ ధీమా వ్యక్తపరిచారు.ఈ ఆన్ క్యాంపస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎం.కోర్ సంస్థ టెక్నికల్ ట్రైనర్ లక్ష్మణ్ తో పాటు కాలేజ్ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ పిఎం రూప, పి.ఏడుకొండలు షేక్.ఆరిఫ్, మీరా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

Before The III Addl. Motor Accidents Claims Tribunal: Nellore
M.V.O.P.No. 273 / 2022

1. **Thummathati Anitha**
2. **Thummathati Lakshmi Narasamma** - Claimants

Vs

1. **Dasari Rajesh** (Died), Rep.by his sister **Dasari Sirisha** and 4 others - Respondents

Notice

To,
R1. **Dasari Rajesh** (died) who is Owner cum Driver of the Motor Cycle bearing Reg. No.AP-26-BT-9620, represented by **Dasari Sirisha, W/o Ramesh,** who is the sister of the deceased as Legal heir, residing at Bheemramgunta Village, Allur Mandal, Nellore District.

పై నెంబరున క్లయిమెంట్స్ మీపై నష్టపరిహారము కోరుతూ పై తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే12-09-2023ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎస్.నరసింహ మూర్తి, బి.కాం., బి.ఎల్.,
ఎస్.శ్రీధర్, బి.కాం., బి.ఎల్.,
క్లయిమెంట్స్ తరపు అడ్వకేట్స్, నెల్లూరు.